క్లుప్తంగా

జాబ్ అఛీవర్స్ డే



కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న శ్రీవెంకటేశ్వర పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం జాబ్ అఛీవర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నై టీవీఎస్ సుందరం కంపెనీకి ఎంపికైన 30 మంది విద్యార్థులు, జాస్మిన్ ఇన్ఫోటెక్‌కు ఎంపికైన 18 మంది విద్యార్థులకు కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ చేతులమీదుగా జాయినింగ్ లెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సి.ప్రకాష్ రావు మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు పొందడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా కళాశాలలో నూతన బోధనా పద్ధతులు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ గిరీష్‌కుమార్, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిడిగుంటపాళెంలో వ్యక్తిపై దాడి

వెంకటాచలం: కుటుంబ వివాదాలతో ఓ వ్యక్తిపై అతని బంధువులు దాడి చేసిన ఘటన వెంకటాచలం మండలంలోని నిడిగుంటపాళెంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు నిడిగుంటపాళెం గ్రామానికి చెందిన పెద్ద మస్తానయ్యకు అతని బంధువులైన విజయమ్మ, మహేంద్రలకు వాగ్వాదం జరిగింది. పెద్ద మస్తానయ్యపై విజయమ్మ, మహేంద్ర దాడి చేయడంతో అతనికి గాయాలయ్యాయి. బాధితుడు సోమవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

104 సేవలపై ఆరా



రికార్డులను పరిశీలిస్తున్న చంద్రశేఖర్

ఇందుకూరుపేట: మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అందుతున్న 104 సేవల గురించి ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ సోమవారం ఆరాతీశారు. ఆయన మాట్లాడుతూ పేదలకు వారి ఇళ్ల వద్దే వైద్యం అందించేందుకు ప్రభుత్వ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అందుకే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను తీసుకొచ్చిందన్నారు. నిర్దేశించిన సమయానికి తప్పనిసరిగా వైద్యసేవలు అందించాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని జనార్దనరెడ్డి కాలనీలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు సోమవారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వికలాంగుల ఐక్య సంఘం ఆధ్వర్యంలో రోగులకు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో వికలాంగుల ఐక్య సంఘం జిల్లా అధ్యక్షుడు సనావుల్లా, జక్కావుల్లా, బ్లాక్ బోర్డు మిత్రమండలి అధ్యక్షుడు నరసాపురం ప్రసాద్, పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ మానస, సిబ్బంది పాల్గొన్నారు.

జీవనశైలి, వ్యాధుల నివారణపై సదస్సు నేడు

నెల్లూరు(అర్బన్): ప్రజాసైన్సు ఉద్యమనేత, డాక్టర్ జి.విజయకుమార్ వర్ధంతి సందర్భంగా జీవనశైలి, వ్యాధుల నివారణ, ఆహారం, ఉపవాసం పాత్ర అనే అంశాలపై మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు స్థానిక మద్రాస్ బస్టాండ్ సమీపంలో ఉన్న డాక్టర్ విజయకుమార్ మెమోరియల్ ట్రస్ట్ నెల్లూరు ఆస్పత్రిలో సదస్సు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు నూనె నారాయణ, గాలి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన వక్తగా డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ పూర్వ రిజిస్ట్రార్, గుంటూరు వైద్యకళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ శంకర్ పాల్గొని మాట్లాడతారని తెలిపారు. ఆసక్తి గల వారు హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని డీఎస్సార్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ గౌతమినగర్ విద్యుత్ ఫీడర్‌లో నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నందున మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని నెల్లూరు టౌన్ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని నేతాజీనగర్, ఎస్‌బీఐ కాలనీ, వాటర్ ట్యాంక్ పరిసరాల్లో ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పొదలకూరుకు కండలేరు జలాలు

- పట్టణానికి ప్రత్యేక పైపులైన్
- జలజీవన్ మిషన్ ద్వారా రూ.17.30 కోట్లు
- పథకం పూర్తయితే ప్రతిరోజూ మంచినీరు
- పాత పైపులైన్ ద్వారా యథాతథంగా తాగునీరు
- తీరనున్న పొదలకూరు ప్రజల కల



కండలేరులో నిర్మించిన మంచినీటిని ఫిల్టర్ చేసే సంపులు

పొదలకూరు : కండలేరు జలాలను పొదలకూరు పట్టణానికి తీసుకువచ్చి ప్రజలకు స్వచ్ఛమైన జలాలను పంపిణీ చేసే పనులు దాదాపుగా పూర్తి కావస్తున్నాయి. కొత్త పైపులైన్ పనులు పట్టణ సమీపం వరకు జరిగినట్లు అధికారులు తెలిపారు. పొదలకూరు పట్టణంలో భవిష్యత్‌లో తాగునీటి ఇబ్బందులు లేకుండా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకుసాగుతున్నారు. ఇందుకోసం జలజీవన్ మిషన్ ద్వారా పట్టణ తాగునీటి అవసరాల కోసం కండలేరు నుంచి ప్రత్యేక పైపులైన్ నిర్మాణం, అవసరమైన చోట్ల రక్షిత మంచినీటి ట్యాంకులను నిర్మించేందుకు రూ.4 కోట్ల నిధులను మంజూరు చేయించారు. అదనంగా మరో రూ.కోటిలను కూడా ఇందుకోసం వెచ్చిస్తున్నారు.

జలజీవన్ మిషన్ ద్వారా..

పొదలకూరు పట్టణానికి పాత పైపులైన్ ద్వారా సక్రమంగా తాగునీరు అందడం లేదు. ఫలితంగా తరచూ మంచినీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పట్టణంలో ఉన్న మంచినీటి స్కీముల ద్వారా ప్రస్తుతం రోజు విడిచి రోజు తాగునీటిని పంచాయతీ నిర్వాహకులు సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పొదలకూరు పట్టణ తాగునీటి అవసరాల కోసం కండలేరు జలాశయం నుంచి ప్రత్యేక పైపులైన్ (15 కి.మీ. దూరం) ఏర్పాటుతోపాటు మండలంలో ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ల కోసం మొత్తం రూ.17.30 కోట్లు జలజీవన్ మిషన్ ద్వారా మంత్రి కాకాణి మంజూరు చేయించారు. ఇందుకోసం కేంద్రం 50 శాతం నిధులు, రాష్ట్రం 50 శాతం నిధులను వెచ్చిస్తున్నాయి. పొదలకూరులో మంత్రి కాకాణి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం కండలేరు జలాశయం నుంచి ప్రత్యేక పైపులైన్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రత్యేక పైపులైన్ నిర్మాణం పూర్తయితే ప్రతిరోజూ తాగునీరు సరఫరా చేయించే అవకాశం లభిస్తుంది.

గ్రామాల్లో మంచినీటి ట్యాంకులు

ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌లో భాగంగా ట్యాంకులు లేని గ్రామాల్లో ముందుగా రక్షిత మంచినీటి ట్యాంకులు నిర్మిస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న ట్యాంకుల స్థానంలో కొత్త ట్యాంకులను నిర్మించనున్నారు. తాటిపర్తి, చెన్నారెడ్డిపల్లి, బత్తులపల్లి, పొదలకూరు, అమ్మవారిపాళెం, నావూరు, రత్నగిరి, తోడేరు, డేగపూడి, మరుపూరు, ప్రభగిరిపట్నం, బ్రాహ్మణపల్లి, ముత్యాలపేట, పార్లపల్లి, చెర్లోపల్లి, దిగువమ్రిపల్లి తదితర గ్రామాల్లో రక్షిత మంచినీటి ట్యాంకుల నిర్మాణానికి అధికారులు అంచనా వేసి నిర్మాణ పనులు చేపట్టారు. కొన్ని గ్రామాల్లో పనులు కూడా పూర్తయ్యాయి. త్వరలో ఇంటింటికీ తాగునీరు అందనున్నాయి.



పైపులైన్ పనులు చేపడుతున్న దృశ్యం (ఫైల్)



కండలేరు సీపీడబ్ల్యూ స్కీమ్‌లో నిర్మించిన రక్షిత మంచినీటి ట్యాంకు

క్రికెట్ టోర్నమెంట్ విజేత ఆదిలక్ష్మమ్మ లెవన్స్



విజేత జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

పొదలకూరు: పొదలకూరులో నిర్వహించిన జిల్లా స్థాయి ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో ఆదిలక్ష్మమ్మ లెవన్స్ జట్టు విజేతగా నిలిచింది. సోమవారం నిర్వాహకులు విజేతలకు బహుమతులను అందజేశారు. పొదలకూరులో ఈ నెల 16న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను నిర్వాహకులు మన్నవరపు రవికుమార్, మనోహర్ ప్రారంభించారు. ఈ పోటీల్లో ఆదిలక్ష్మమ్మ లెవన్స్ జట్టు విజేతగా, ఫ్రెండ్స్ లెవన్స్ జట్టు రన్నర్‌గా నిలిచాయి. విజేత జట్టుకు రూ.20 వేలు, రన్నర్ జట్టుకు రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. వెడిచర్ల లీలావతి జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు విజేత జట్టుకు నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో వెడిచర్ల మురళి, విష్ణు, నాగతేజ, సురేంద్ర, బాషా, వరప్రసాద్, నాగభూషణం, క్రీడకారులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలతో విజ్ఞానం



శిక్షణ శిబిరంలో పేపర్ క్రాఫ్ట్‌పై సాధన చేస్తున్న విద్యార్థులు

కొడవలూరు: విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు వేసవి శిక్షణ శిబిరాలు ఎంతగానో దోహదపడుతుందని గ్రంథాలయాధికారిణి కె.రాజేశ్వరి తెలిపారు. వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా కొడవలూరులోని గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలతో విద్యార్థుల్లో విజ్ఞానం, నైతిక విలువలు పెంపొందుతాయని తెలిపారు. అనంతరం విద్యార్థులకు నైతిక విలువలు పెంపొందించే 'చిలుక, కాకి, నక్క' కథను వినిపించారు.

వీరేశలింగం పంతులు చిరస్మరణీయులు

నెల్లూరు(బృందావనం): సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు తెలుగు వారు గర్వించదగిన మహోన్నత వ్యక్తి అని, తెలుగువారి మదిలో ఆయన చిరస్మరణీయులని పలువురు కొనియాడారు. నగరంలోని నర్తకిసెంటర్‌లో సోమవారం రాత్రి కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత వీరేశలింగం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో శింగంశెట్టి మురళీమోహన్ రావు, ఎ.జయప్రకాష్, దగ్గుబాటి రాధాకృష్ణ, ఎస్వీఎస్ సత్యం, రాఘవనాయుడు, మహేష్, గౌస్‌బాషా, గోవర్ధన్, శీనయ్య, షఫీ, మారి, నాగేంద్రకుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వేసవి శిక్షణ శిబిరంలో వివిధ క్రీడల్లో శిక్షణ పొందుతున్న సుమారు 900 మంది క్రీడాకారులకు సోమవారం ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త బండి వేణుగోపాల్‌రెడ్డి, వాకర్స్ డిస్ట్రిక్ట్ డిప్యూటీ గవర్నర్ రఘురామ్ ముదిరాజ్ క్రీడాకారులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో డి.అనంత రామారావు, జి.వెంకటసురేంద్రబాబు, బలరామయ్యనాయుడు, బి.శేషగిరిరావు, జి.రఘురామనాయుడు, హరిప్రసాద్, డి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సీఎం కావాలంటూ పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న కిరణ్, కల్యాణ్

నెల్లూరు(టౌన్): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం పదవి చేపట్టాలంటూ వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు గెలవాలంటూ ఈ నెల 24న ఆ పార్టీ కార్యకర్తలు పేటేటి కిరణ్, కర్రా కల్యాణ్ వేమూరు నియోజకవర్గం నుంచి చేపట్టిన పాదయాత్ర సోమవారం నెల్లూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా నగరంలోని పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వారిని కలిసి సంఘీభావం తెలిపారు. కోరిక నెరవేరాలంటూ ఆకాంక్షించారు.

స్వర్ణ టోల్‌వే సిబ్బందిని అడ్డుకున్న దుకాణదారులు

- ఆక్రమణల తొలగింపు ప్రక్రియ వాయిదా



టోల్‌వే సిబ్బందితో స్థానికుల వాగ్వాదం

మనుబోలు: మనుబోలులోని వైఎస్సార్ సర్కిల్ వద్ద సోమవారం ఆక్రమణల తొలగింపు కోసం వచ్చిన స్వర్ణ టోల్‌వే సిబ్బందిని స్థానిక దుకాణదారులు అడ్డగించడంతో వివాదం నెలకొంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండడంతో స్పందించిన ఎస్సై అజయ్‌కుమార్ ఇరువర్గాలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. రెండు వైపులా నష్టపోకుండా చూసుకోవాలని సూచించారు. ఒక్కసారిగా అంగళ్లు తొలగిస్తే తాము ఉపాధి కోల్పోతామని దుకాణదారులు చెప్పడంతో తొలగింపు ప్రక్రియను వాయిదా వేసుకోవాలని స్వర్ణ టోల్‌వే సిబ్బందికి సూచించారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకూ దుకాణాలు తెరవొద్దని దుకాణదారులకు ఆదేశాలిచ్చారు. అలాగే ప్రభుత్వ స్థలంలో శాశ్వత కట్టడాలు కట్టడం, షెడ్లు వేయడం చేయొద్దని హెచ్చరించారు.

సేవానాథం ట్రస్ట్ దాతృత్వం

- రూ.1.20 లక్షల ఆర్థికసాయం



బాధిత మహిళకు ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీనాథ్‌రెడ్డి

మనుబోలు: శ్రీసేవానాథం ట్రస్ట్ ద్వారా మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి అందిస్తున్న సేవలను పలువురు కొనియాడుతున్నారు. మనుబోలులో ఆర్థికంగా చితికిపోయిన నాలుగు కుటుంబాలకు ట్రస్ట్ వ్యవస్థాపకుడు శ్రీనాథ్‌రెడ్డి ఆదివారం రాత్రి రూ.1.20 లక్షల ఆర్థికసాయం అందించారు. గిరిజనకాలనీకి చెందిన పాముల శ్రావణి భర్త చనిపోయి కుటుంబ పోషణ కష్టంగా మారడంతో ఆమెకు రూ.50 వేలు అందజేశారు. అదే కాలనీకి చెందిన గునపాటి ఏడుకొండలు రోడ్డు ప్రమాదంలో గాయపడి కన్ను పోగొట్టుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో అతనికి రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. అంబేడ్కర్‌నగర్‌కు చెందిన గుర్రం పోలమ్మ కుటుంబానికి రూ.50 వేలు అందజేశారు. అలాగే బేల్దారి పనులు చేసే సురేంద్ర ఇటీవల జారిపడి ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండగా.. అతనికి రూ.10 వేల ఆర్థికసాయం అందించానే. ఆయన వెంట ట్రస్ట్ సభ్యులు ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



తిక్కవరప్పాడు బ్రాంచ్ కెనాల్‌పై ప్రమాదకర కల్వర్టు

వెంకటాచలం: మండలంలోని తిక్కవరప్పాడు–కంటేపల్లి మార్గంలో తిక్కవరప్పాడు బ్రాంచ్ కెనాల్‌పై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. నిత్యం పలు గ్రామాల రైతులు, ప్రయాణికులు ఈ మార్గంలో ప్రయాణిస్తుంటారు. అయితే ఈ మార్గంలో నిర్మించిన కల్వర్టు శిథిలమై సగంపైగా కూలిపోవడంతో ద్విచక్రవాహనాలు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నాయి. అదుపుతప్పితే ప్రమాదం జరిగేలా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నేడు పోలేరమ్మకు సద్ది సమర్పణ

ఇందుకూరుపేట: మండలంలోని కొమరికలో వెలసిన శ్రీపోలేరమ్మకు మంగళవారం చద్ది సమర్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొడవలూరు: స్థానిక గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో 3వ తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఉన్న ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ పి.దేవసహాయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తరగతిలో 40 సీట్లు, 4వ తరగతిలో 31, 5వ తరగతిలో 22, 6వ తరగతిలో 11, 7వ తరగతిలో 10, 8వ తరగతిలో 10, 9వ తరగతిలో 13 సీట్ల చొప్పున ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు నేరుగా గురుకులంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 9550679399, 9652457009 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

వివాహ పరిచయ వేదికకు అనూహ్య స్పందన



వధూవరుల వివరాల పుస్తకాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

నెల్లూరు(బృందావనం): నగరంలో ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్దనున్న డీఎస్ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన 6వ రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదికకు అనూహ్య స్పందన లభించిందని కార్యక్రమ నిర్వాహకుడు ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్ సోమవారం తెలిపారు. శ్రీగాయత్రి కల్యాణమస్తు, బ్రాహ్మణ వివాహ సమాచార కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య సంయుక్త సౌజన్యంతో కార్యక్రమం జరిగిందని ఆయన తెలిపారు. ఈ వేదికలో సుమారు 350మందికి పైగా వధూవరుల తల్లిదండ్రులు పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటరామరాజు, అఖిల భారత వివాహ సమాచార కేంద్రాల సమాఖ్య అధ్యక్షుడు కేవీ బలరామకృష్ణమూర్తి, నాయకులు జి.వాసుదేవ రావు, ఐ.జయలక్ష్మి ఎస్.శేఖర్, ఎస్వీ శ్రావణ్, వి.రవికుమార్, జి.జయలక్ష్మి, ఎస్.ఉమ తదితరులు పాల్గొని పర్యవేక్షించారు

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి



వెంకటాచలం: కసుమూరులో రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ శ్రీనివాసులు



కొడవలూరు: కొత్తవంగల్లులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ అనూష

వెంకటాచలం: సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని కసుమూరు, కురిచెర్లపాడు గ్రామాల్లో సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై సోమవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువుల వాడకం వల్ల పెట్టుబడులు పెరగడమే కాకుండా తెగుళ్ల ప్రభావం ఎక్కువగా ఉంటోందనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల పెట్టుబడులు చాలా వరకు తగ్గి దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. సేంద్రియ ఎరువులతో సారవంతమైన భూమిని భావితరాలకు అందించినట్లవుతుందని తెలిపారు. నూతన వ్యవసాయ విధానంలో భాగంగానే నానో యూరియా, నానో డీఏపీలను ఉపయోగించుకోవాలని సూచించారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా 50 శాతం రాయితీతో అందించే పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సదస్సులో ఏఓ హరికరుణాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తగు మోతాదులో ఎరువులు వినియోగించాలి

పొదలకూరు : రైతులు తగు మోతాదులో ఎరువులు వినియోగించాలని ఏఓ యు.గీతాకుమారి సూచించారు. భూసారం పెంపుదలపై పొదలకూరు మండలంలోని డేగపూడి గ్రామంలో సోమవారం ఏఓ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు ముందుగా భూసార పరీక్షలు చేయించుకుని అందుకు అనుగుణంగా తగు మోతాదులో ఎరువులు వినియోగించుకోవాలని సూచించారు. పచ్చిరొట్ట విత్తనాలను ఆర్బీకేల్లో 50 శాతం రాయితీపై రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. జీలగలు, జనుములు, పిల్లిపెసర్లు తదితర పచ్చిరొట్ట ఎరువులను సాగు చేసి పొలాల్లో వేసి కలియ దున్నితే భూమి సారవంతం అవుతుందని తెలిపారు. భూమి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

భూసారం పెంపుతో అధిక దిగుబడులు

కొడవలూరు: భూసారాన్ని పెంపొందించుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఈఓ ఎ.అనూష సూచించారు. భూసారం పరిరక్షణపై కొడవలూరు మండలం కొత్తవంగల్లు, మిక్కిలింపేట గ్రామాల్లో సోమవారం రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. కొత్తవంగల్లులో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్ట సాగు చేయడం ద్వారా భూసారాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ప్రభుత్వం 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలైన పిల్లిపెసర, జీలగలు, జనుములు పంపిణీ చేస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు మౌర్య, వంశీ, రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు

తోటపల్లిగూడూరు: సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి శిరీషా రాణి అన్నారు. పంటల సాగులో సమగ్ర పోషణ యాజమాన్య పద్ధతులపై తోటపల్లిగూడూరు మండలం పొట్లపూడి, వెంకన్నపాళెం రైతుభరోసా కేంద్రాల పరిధిలో సోమవారం వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పంటల సాగుకు ముందుగా మట్టి పరీక్షలు చేయించుకొని దానికి అనుగుణంగా మంచి ఎరువులను ఎంచుకోవాలన్నారు. భూమికి హాని కలిగించే రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి.. పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువులను ఉపయోగించాలని సూచించారు. ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా 50 శాతం రాయితీతో అందజేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఝాన్సీ, అనూష, రైతులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుతో మేలు

విడవలూరు: పచ్చిరొట్ట పైర్లు సాగు చేసి భూమిలో కలియదున్నితే భూసారం పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి పి.వెంకటకృష్ణయ్య తెలిపారు. పచ్చిరొట్ట పైర్లు, ఎరువుల యాజమాన్యంపై విడవలూరు మండలంలోని అన్నారెడ్డిపాళెం రైతుభరోసా కేంద్రంలో సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిసాగుకు ముందు పొలాల్లో జీలగలు, జనుములు, పిల్లిపెసర, అలసంద వంటి విత్తనాలను చల్లుకోవడం ద్వారా నేల సారవంతంగా అవుతుందని తెలిపారు. అనంతరం రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.